సాక్షి నంద్యాల

గురువారం : 5 : డిసెంబర్ : 2024



కాటా కిరికిరి

డోన్ పూలమార్కెట్‌లో కాటా కిరికిరి ఉద్రిక్తతకు దారితీసింది. వారం రోజుల క్రితం రైతులు, వ్యాపారులు, దళారుల మధ్య తలెత్తిన వివాదంతో పూల వ్యాపారం స్తంభించిపోయింది. - 8లో



అన్నప్రసాదానికి విరాళాలు

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన సుశీల రూ. లక్ష, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చల్లా శ్రీనివాసరావు రూ. లక్ష అందించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1.633
ప్రస్తుతం	:1.629.55
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:92.425
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,246
అవుట్ ఫ్లో	:5,224

న్యూస్‌రీల్

864.20 అడుగులుగా శ్రీశైల డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయ నీటిమట్టం బుధవారం సాయంత్రం సమయానికి 864.20 అడుగులకు చేరుకుంది.జలాశయంలో 119. 4902 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం పరిసర ప్రాంతాల్లో మంగళవారం నుంచి బుధవారం వరకు 0.60 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సెల్ఫ్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాల కారణంగా 944 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 2.950 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 11,104 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సబ్ జైలులో మాట్లాడుతున్న జడ్జి కబర్ధి

డోన్ టౌన్: ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రిన్స్‌పల్ జడ్జి జి. కబర్ధి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు ఆవరణలో ఖైదీలతో సమావేశమై ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. అనంతరం కోర్టు ఆవరణలో రూ. 23 కోట్లతో జరుగుతున్న కోర్టు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్దేశించిన సమయంలోపల పనులు నాణ్యతగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. సివిల్ కేసులు, క్రిమినల్ కేసుల్లో కొన్నింటిని చట్ట పరిధికి లోబడి రాజీ చేసుకోవచ్చునన్నారు. ఒక సారి లోక్ అదాలత్‌లో రాజీ అయ్యి కేసును పరిష్కరించుకున్న తరువాత అప్పీల్ వెళ్లే అవకాశం ఉండదన్నారు. అనంతరం డోన్ బార్ కౌన్సిల్ సభ్యులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. న్యాయ సేవలు ప్రతి ఒక్కరికి సమానంగా అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, ఫస్టక్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతితో పాటు సబ్ డీఎస్పీ శ్రీనివాసులు,సీఐలు ఇంతియాజ్‌బాషా, జైలు లీగల్ అడ్వయిజర్ మాధవస్వామి యాదవ్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, జైలు సూపరిండెంట్ రఘునాథ రెడ్డి, పలువురు న్యాయవాదులు ఉన్నారు.

అహల్యాపురంలో పెద్ద పులి సంచారం!

పాణ్యం: మండల పరిధిలోని అహల్యాపురం గ్రామంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇక్కడి కొండ ప్రదేశాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేయడంతో అక్కడ ఉన్న జింకలు పంటపొలాల్లోకి వస్తున్నాయి. వీటిని వేటాడుతూ రెండురోజుల క్రితం పెద్దపులి పొలాల్లోకి రావడాన్ని గమనించినట్లు రైతులు చెబుతున్నారు. ఈ విషయం ఊరిలో చెప్పడంతో గ్రామస్తులు హడలిపోతున్నారు. అటవీశాఖ అధికారులు పెద్ద పులిని గుర్తించి పట్టుకోవాలని కోరుతున్నారు. దీనిపై డీఆర్‌ఓ విజయలక్ష్మీ వివరణ కోరగా గ్రామంలో పర్యటించి పులి పాదముద్రలు పరిశీలిస్తామన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 92 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన 5వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 92 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగగా 4,219 మందికి 3,892 మంది విద్యార్థులు హాజరు కాగా 327 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. డోన్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర పరీక్ష కేంద్రంలో చూచిరాతకు పాల్పడిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు. కర్నూలు నగరంలోని సాయికృష్ణ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సీఈ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించి పరిశీలించారు.

సీపీఆర్‌కు పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితాలను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు పంపేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో గ్రేడ్ - 1, 2, 3 పంచాయతీ కార్యదర్శుల వివరాలను ఈ నెల 8వ తేదీలోగా సీపీఆర్‌కు పంపాల్సి ఉందన్నారు. మిగిలిన గ్రేడ్ - 4, 5 పంచాయతీ కార్యదర్శుల సీనియారిటీ జాబితాలను తయారు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని సీపీఆర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు దాదాపు 400 మందికి పైగా ఉన్నారు.



ఆక్రమించి..అద్దెకిచ్చి

☛ ఇక్కడ కనిపించే ఈ రెండు బంకులు ప్రభుత్వ వైద్యశాల ప్రధాన గేటు కుడివైపు ఉన్నాయి. అంబులెన్స్‌లు వచ్చిపోయేందుకు వీలుగా ఖాళీగా ఉంచిన స్థలాన్ని మునిసిపల్ వైస్ చైర్మన్ ఆక్రమించుకుని వాటిని ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పుడు ఈ ఒక్కొక్క బంకుకు రూ లక్ష వరకు అడ్వాన్స్ తీసుకు ని నెలకు రూ. 15 వేలు బాడుగ వసూలు చేస్తున్నాడు. అదే పేదవాడు బతకదానికి అక్కడ బంకు వేస్తే ఆసుపత్రికి అడ్డమని తొలగించిన అధికారులకు వందకోట్ల ఆసామీ మునిసిపల్ వైస్ చైర్మన్ వేసిన బంకులు కనిపించడం లేదా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అధికారపార్టీ అండదండలు

☛ ప్రభుత్వ ఆసుపత్రి లోపలకు వెళ్లే ఎడమవైపు గేట్‌కు అనుకుని వేసిన ఈ బంకు అధికార పార్టీ నేత చెప్పాడని అతని అనుచరుడు నాలుగు రోజుల క్రితం దౌర్జన్యంగా బంకు వేసుకున్నాడు. ఆసుపత్రి లోపలకు వెళ్లి వచ్చేందుకు ఇది పూర్తిగా అడ్డంగా ఉంది. ఈ విషయం రోగులు, స్థానికులు సదరు నేత దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. ఆ క్రమణలను తొలగించాల్సిన అధికారులు సైతం బంకు ఏర్పాటు చేసిన వ్యక్తికి అధికారపార్టీ అండ ఉండటంతో చూడనట్లు వ్యవహరిస్తున్నారు.



ఖాళీ జాగా.. వేసేయ్ పాగా!

ఆళ్లగడ్డలో ఆక్రమణలు, భూకబ్జాలు పెరిగిపోయాయి. జానెడు ఖాళీ జాగా కనిపిస్తే చాలు తెల్లారేసరికి అందులో ఓ బంకు వెలుస్తోంది. ఆ తర్వాత శాశ్వత కట్టడాలుగా మారుతాయి. వాటిల్లో అనధికారిక వ్యాపారాలు సాగించడం ఓ ఎత్తైతే వాటినే నెల.. వారం.. రోజు వారి లెక్కన అద్దెలకు ఇచ్చి అక్రమంగా రూ. లక్షలు సంపాదిస్తున్నారు తెలుగుతమ్ముళ్లు. ఈ అక్రమార్కులకు అధికారపార్టీ పెద్దలు వంతపాడుతుండటంతో అధికారులు చోద్యం చూస్తున్నారు.

- ప్రభుత్వ కార్యాలయాల స్థలాలపై తెలుగుతమ్ముళ్ల కన్ను
- యథేచ్ఛగా ఆక్రమించుకొని బంకులు వేసి సొమ్ము చేసుకుంటున్న వైనం
- అధికారపార్టీ అండతో ఆళ్లగడ్డ పట్టణంలో 800కు పైగా ఏర్పాటు
- ప్రధాన కూడళ్లలో ఆక్రమణల జోరు
- కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలు
- మూసుకుపోతున్న మురుగు కాల్వలు.. కుచించుకుపోయిన రహదారులు
- ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లు, అత్యవసర వాహనాలు రావాలంటే తప్పని ఇక్కట్లు
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికార యంత్రాంగం
- వంద కోట్ల ఆసామీకి కూడా ప్రభుత్వ స్థలంలో బంకులు!

ప్రభుత్వ వైద్యశాల ప్రధాన గేట్‌కు ఇరువైపుల దౌర్జన్యంగా వేసిన బంకులు



ఆళ్లగడ్డ: తాము అధికారంలోకి వస్తే ఆళ్లగడ్డ మునిసిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం. ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురికాకుండా చేస్తాం.. ఆదాయం పెంచి పట్టణ వాసులకు పన్నుల భారం తగ్గిస్తాం.. ఇలా ఎన్నికల ముందు ఉపన్యాసాలిచ్చిన అధికార పార్టీ నేతలు ఇప్పుడు వాటన్నిటినీ మరిచి పోయారు. ప్రభుత్వ స్థలాలు పరిరక్షిస్తామని చెప్పిన వారే నేడు ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ పాగా వేస్తున్నారు. ఈ దందా వల్ల రహదారులు కుచించుకుపోతున్నా.. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన గేట్లు మూసుకు పోతున్నా..రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాల కబ్జాతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా అధికారులు నోరెత్తడం లేదు. దీంతో ఆళ్లగడ్డ మున్సిపాలిటీ విలువైన స్థలం కోల్పోవడంతో పాటు రూ. లక్షల్లో ఆ సంస్థ ఆదాయానికి గండి పడుతోంది.

ఖాళీ కనిపిస్తే కైవసమే!

ఆళ్లగడ్డ పట్టణంలో జనాభా రోజురోజుకు పెరుగుతోంది. అయిదేళ్ల కిందట 40 వేల జనాభా ఉన్న ప్రస్తుతం 55 వేలకు చేరింది. ఇతర మండలాలు, గ్రామాల నుంచి కుటుంబాలు తరలివచ్చి వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. భవన యజమానులు దుకాణాల అద్దెలు భారీగా పెంచేశారు. రూ. లక్షల్లో అడ్వాన్సులు రూ. వేళల్లో బాడుగలు వసూలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన అధికార పార్టీ చోటా నాయకులు రోడ్ల మార్జిన్లు, మురుగు కాల్వలను ఆక్రమించి బంకులు, రేకులతో షెడ్లు ఏర్పాటు చేసి బాడుగలకు ఇచ్చుకుంటు సొమ్ము చేసుకుంటున్నారు. చిన్న కొట్టుకు రూ. 8 వేల నుంచి రూ. 15 వేల వరకు అద్దెలు నిర్ణయించి పేదల నుంచి దోచుకుంటున్నారు. కొందరు ఏకంగా లక్షల్లో అడ్వాన్స్‌లు వసూలు చేసుకుని అగ్రిమెంట్లు కూడా రాసి ఇవ్వడం గమనార్హం .ఇదంతా ప్రభుత్వం కార్యాలయాల ఎదురుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ మీటర్లూ బిగిస్తున్నారు..

రోడ్డు మార్జిన్లు, మురుగు కాల్వలు ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టిన దుకాణాలకు విద్యుత్ మీటర్లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. సొంత ఇంటికి మీటరు ఏర్పాటు చేయాలంటే సవాలక్ష ధ్రువీకరణ పత్రాలు అడిగే అధికారులు వీటికి మాత్రం అడిగిన గంట లోపే మీటర్లు తీసుకువచ్చి బిగించి వెళ్తుండటం గమనార్హం.

కలెక్టర్ ఆదేశాలు బుట్టదాఖలు !

ప్రభుత్వ స్థలంలో కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతుండటంతో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే రోగులకు చాలా ఇబ్బందిగా ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే వాటిని కూల్చి వేయాలని అధికారికంగా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే, అధికార పార్టీ నేతలకు బయపడి కలెక్టర్ ఆదేశాలు కూడా లెక్క చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి

800కు పైగా అక్రమ దుకాణాలు

అధికార పార్టీ అండతో కొందరు పట్టణంలోని మురుగు కాల్వలను, ప్రధాన కూడళ్లలోని మార్జిన్లు ఆక్రమించి రెండు, మూడు నాలుగు ఇలా అవకాశమున్నన్ని బంకులు వేసుకుంటున్నారు. తర్వాత వాటికి అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. పట్టణంలో సుమారు 800 అక్రమ దుకాణాలున్నాయి. ఇవి 10 నుంచి 20 అడుగుల మేర రోడ్లపైకి విస్తరించడంతో 70 అడుగుల పైగా ఉండాల్సిన రహదారి ప్రస్తుతం 50 అడుగలకు చేరుకుంది. వ్యాపార సంస్థలకు సంబంధించిన హోర్డింగులను రోడ్డు మీదే పెడుతుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే ఆక్రమణదారుల బంకుల ముందు రోడ్డుపై ఎవరైనా తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారం చేస్తే ప్రతి నెల రూ. 3 వేల నుంచి రూ. 5 వేలు వసూలు చేస్తున్నారు



హాస్పిటల్, పోలీస్, రెవెన్యూ కార్యాలయాలు కనిపించకుండా ప్రధాన రహదారిలో నిర్మాణాలు చేపట్టిన కబ్జాదారులు

అధికారులకు ఫిర్యాదు చేశాం



ఆసుపత్రికి వచ్చే రోగులు, బంధువులు తమ వాహనాలను బయట ఆపుకునేందుకు వీలు లేక లోపల పార్క్ చేస్తున్నారు. కనీసం ప్రధాన గేట్లు అనుకుని అయినా కాస్త ఖాళీ వదలమని చెబుతున్నా ఎవరు పట్టించుకోవడంలేదు. దీంతో అంబులెన్స్‌లు రావాలంటే ఇబ్బందిగా మారింది. ఈ విషయం ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకుపోయాం.

– డా సుజాత, సీహెచ్‌సీ సూపరిండెంట్

విచారించి చర్యలు తీసుకుంటాం



నేను ఆళ్లగడ్డ మునిసిపల్ కమిషనర్‌గా కొత్తగా జాయిన్ అయినాను. పట్టణంలో అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని బాడుగకు ఇచ్చిన వారికి నోటీసులు ఇస్తాం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోయి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– దస్తగిరిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రేపటి నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు
- ప్రతి అర్జీకి రసీదు..45 రోజుల్లో పరిష్కారం
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా రెవెన్యూ సదస్సులపై అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెక్షన్ 22 ఎ భూ ఆక్రమణలు, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి బాధిత రైతులు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించవచ్చన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, మండలంలో జిల్లాస్థాయి అధికారి నోడల్ ఆఫీసర్లుగా రెవెన్యూ సదస్సుల్లో పాల్గొంటారన్నారు. జిల్లా కలెక్టర్, జేసీలు ప్రతి నియోజకవర్గంలో జరిగే సదస్సుకు హాజరవుతామన్నారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా స్వీకరించే ఫిర్యాదులన్నింటినీ రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) రూపొందించిన గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్లోని ప్రత్యేక విండోలో ఆన్‌లైన్‌లో పొందుపర్చుతామని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి అర్జీకి రసీదు ఇవ్వడంతో పాటు 45 రోజుల్లో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో రీ సర్వే నిర్వహించినట్లయితే కొత్తగా తయారు చేసిన ఆర్‌ఓఆర్‌ను చదివి వినిపించడంతో పాటు వాటిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. ప్రధానంగా హైకోర్టు కేసులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. భూ వివాదాలను సామరస్యంగా పరిష్కరించేందుకు రెవెన్యూ బృందాలు ప్రయత్నించాలని ఆదేశించారు. సరిహద్దు వివాదాలు ఏవైనా ఉంటే మండల సర్వేయర్లను నియమించి భూమిని రీ సర్వే చేయించి పరిష్కరించాలన్నారు. అలా గే రెవెన్యూ సదస్సుల తేదీ, స్థలాన్ని టాం-టా ం ద్వారా ప్రచారం కల్పించాలన్నారు.

బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలి

బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ పథకాల రుణ మంజూరుపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేసిన కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు విఫలమయ్యారని, అన్నం పెట్టే రైతులను ఆదుకోవడానికి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆర్‌ఓఎఫ్ఆర్ భూములకు, సూక్ష్మసేద్య పరిశ్రమలకు, మహిళా సాధికారత ఉపాధికి, విద్యా రుణాలు, గృహ రుణాలు, చేనేత రుణాలు, తదితర ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన ప్రతి లక్ష్యంలో 50 శాతం కూడా అధిగమించలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘాల రుణాలు మినహా ఇతర ఏ ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్ల నుంచి సహకారం లేదన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు రుణాల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తున్నాయన్నారు. చేనేత కార్మికులు, మత్స్యకారులకు అవసరం మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం పీఎం సురక్ష బీమా యోజన పథకం కింద ప్రీమియం చెల్లించి ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబ సభ్యులకు రూ.లక్ష చొప్పున రెండు చెక్కులు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహారావు, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిశ్రమవర్ధక శాఖ అధికారి గోవిందు నాయక్, మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి, ఏపీజీబీ రీజనల్ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

8న జెడ్పీ సర్వసభ్య సమావేశం

- అదే రోజున ఉదయం 9 గంటలకు స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 8వ తేదీన (ఆదివారం) ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, పీఆర్ ఇంజనీరింగ్, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలను కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు సీఈఓ తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఇన్‌చార్జ్ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే రెండు జిల్లాలకు చెందిన కలెక్టర్లు కూడా ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలోనే రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరు కావాలని సీఈఓ కోరారు. కాగా, ఈ సమావేశాన్ని నవంబర్ 25వ తేదీన నిర్వహించాలని ముందుగా ప్రకటించినా, అదే రోజు నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అయిన దృష్ట్యా అప్పట్లో వాయిదా వేసిన ఈ సమావేశాన్ని 8వ తేదీన నిర్వహిస్తున్నారు. కాగా ... అదే రోజున ఉదయం 9 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో 1,2వ స్థాయీ సంఘ సమావేశాలను కూడా నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి తెలిపారు.

ఆశలు వర్షార్పణం!

- ఫెంగల్ తుపానుతో నేలకొరిగిన వరి పైరు
- తడిసిన ధాన్యం
- ఆందోళనలో రైతన్నలు



ధాన్యం రాశుల్లో నిలిచిన నీటిని తోడేస్తున్న రైతులు

పాణ్యం: గతేడాదిలాగా ఈ ఏడాది కలిసి వస్తుందని వరి సాగు చేసిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఫెంగల్ తుపాను ప్రభావంతో నాలుగు రోజులుగా వివిధ మండలాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. ఇదే సమయంలో నంద్యాల, ఆళ్లగడ్డ, పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గాల పరిధిలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పలు చోట్ల కోతకోసి ధాన్యాన్ని ఆరబెట్టారు. వర్షాలకు ఆ ధాన్యం తడిచిపోవడంతో రైతుల ఆందోళన అంతా.. ఇంతా కాదు. తడవడం వల్ల ధాన్యం రంగు మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే ధరలు పడిపోయి నష్టాలు మూట గట్టుకుంటున్న కర్షకులకు ప్రస్తుత తుపాను మరింత దెబ్బతీసింది. పాణ్యం మండలం కొండజుటూరు, చిలకల, ఆలమూరు తదితర గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు బుధవారం రైతులు అష్టకష్టాలు పడ్డారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

రేపు విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు

కర్నూలు(అర్బన్): ఈనెల 6న స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవనంలో విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి తెలిపారు. సదస్సుకు హాజరై విశ్వకర్మ పథకం గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని బుధవారం లీడ్ డిస్ట్రిక్ట్ డివిజినల్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావును కోరారు. ఈ సందర్భంగా ధనుంజయ ఆచారి మాట్లాడుతూ విశ్వకర్మ పథకం కింద లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాలకు చెందిన ప్రజలు హాజరై రుణాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, శిక్షణ ఎలా ఇస్తారు, బ్యాంకుల సహకారం, తిరిగి రుణాలను ఎలా చెల్లించాలనే అంశాలపై సదస్సులో వివరిస్తారన్నారు. ఆయా వర్గాల ప్రజలు హాజరై సలహాలు, సూచనలు అందించడంతోపాటు అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

నేడు, రేపు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

కర్నూలు(అర్బన్): రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి ఈనెల 5, 6వ తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ అధికారులకు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మండలం నుంచి ఈఓఆర్‌డీ/పంచాయతీ కార్యదర్శి, ఎంపీహెచ్ఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు హాజరు కావాలన్నారు. ఒక్కో మండలం నుంచి 6 మందికి బ్లాక్ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్‌గా శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పొందిన వారు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ఆయా మండలాల్లో రెండు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇతర లైన్ డిపార్టుమెంట్ అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు.

కేసీలో యువకుడి గల్లంతు

పాములపాడు: మండల పరిధిలోని కంబాలపల్లె సమీపంలోని కేసీ కాల్వలో తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మానవపాడు గ్రామానికి చెందిన కుర్వ మధు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంబాలపల్లె గ్రామానికి చెందిన సూర్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు మధు కంబాలపల్లెకు బుధవారం వచ్చాడు. కార్యక్రమం పూర్తయిన తర్వాత కంబాలపల్లె గ్రామం పక్కనే ఉన్న కేసీ కాల్వలోకి స్నానం చేసేందుకు దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. కాపాడేందుకు బంధువులు యత్నించినా ప్రయోజనం లేకపోయింది. అతని ఆచూకీ కోసం కోసం బంధువులు కేసీ కాల్వ వెంట గాలిస్తున్నారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు.

గొలుసు దొంగ హల్‌చల్

కర్నూలు: నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. కోడుమూరు మండలం గోరంట్ల రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన చెంచమ్మ (62) దంపతులు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో నివాసముంటున్నారు. బుధవారం ఉదయం పాల ప్యాకెట్ కొనుగోలు చేసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఆమెను సమీపించి మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల గొలుసును లాక్కుని ఉడాయించారు. ఆమె అప్రమత్తమై కేకలు వేసేలోగా వాహనం వేగం పెంచి కనిపించకుండా పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మూడో పట్టణ సీఐ శేషయ్య తెలిపారు.

జగనన్న కాలనీలో ..

పెద్దకడబూరు: స్థానిక జగనన్న కాలనీలో దొంగలు పడి మెటీరియల్‌ను ఎత్తుకెళ్లిపోయారని జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి బొగ్గుల నరసన్న ఆరోపించారు. బుధవారం ఆయన కాలనీని పరిశీలించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం బేస్‌మెంట్ నిర్మాణంలో ఉపయోగించిన సిమెంట్ బ్రిక్స్‌తోనాటి పోగుచేసుకున్న కంకర, ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి జగనన్న కాలనీలో చోరీకి గురైన బ్రిక్స్, కంకర, ఇసుక రికవరీ చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్, దేవదాయ భూములపై ప్రభుత్వం ఆరా!

- కలెక్టర్ పర్యవేక్షణలో డిస్ట్రిక్ట్ వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు
- తహసీల్దార్ల నేతృత్వంలో సర్వే బృందాలు
- ఈనెల 20 లోపు ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశం



వక్ఫ్, దేవదాయ భూములపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఉండాల్సిన, ప్రస్తుతమున్న, ఆక్రమణలకు గురైన భూముల వివరాలను ఈనెల 20లోపు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో తహసీల్దార్ల నేతృత్వంలో మండలానికో సర్వే బృందాన్ని ఏర్పాటు చేసి, వీలైనంత త్వరగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. – కర్నూలు(సెంట్రల్)

జిల్లాలోని వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా ప్రతి జిల్లాకు కలెక్టర్ నేతృత్వంలో డిస్ట్రిక్ట్ వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం కృషి చేయాలి. అయితే కర్నూలు జిల్లా కలెక్టర్ దేవదాయ భూముల సంరక్షణకు కూడా చర్యలు తీసుకునే విధంగా అందులో మార్పులు చేశారు. వక్ఫ్, దేవదాయ శాఖలకు సంబంధించిన భూముల వివరాలపై ఇటీవల కమిటీ మొదటి సమావేశం జరిగింది. రెండో సమావేశం డిసెంబర్ 20వ తేదీ నిర్వహిస్తానని, అంతలోపు జిల్లాలోని వక్ఫ్, దేవదాయ శాఖల భూములు వివరాలపై సర్వే చేయాలని రెవెన్యూ, సర్వే, వక్ఫ్ బోర్డు, దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు.

సమగ్ర వివరాలతో సర్వే చేసేలా చర్యలు

వక్ఫ్, దేవదాయ శాఖల భూముల సర్వేకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో డీఆర్వో వెంకట నారాయణమ్మ చర్యలు చేపట్టారు. ప్రతి మండలంలో తహసీల్దార్ నేతృత్వంలో సర్వే బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందంలో తహసీల్దార్‌తోపాటు మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ ఉంటారు. కర్నూలు జిల్లాలో 26 మండలాల్లో 26 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. వీరంతా వక్ఫ్, దేవదాయ శాఖలకు సంబంధించిన భూములను సర్వే చేసి యాప్‌లో నమోదు చేయాలి. ఆయా శాఖల రికార్డుల ఆధారంగా ఎంత విస్తీర్ణంలో భూములు ఉండాలి? ఏమైనా కబ్జాకు గురయ్యాయా? గురై ఉంటే అందులో ప్రస్తుతం భవనాలు కట్టారా? ఖాళీ స్థలంగా ఉంచారా తదితర వివరాలతోపాటు వాటి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ భూముల గూగుల్ మ్యాప్స్ వివరాలతో కూడిన జీపీఎస్ సమాచారాన్ని కూడా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆక్రమణ భూములను ఏమి చేస్తారనే దానిపై ఆందోళన

జిల్లాలో వక్ఫ్ బోర్డు రికార్డుల ప్రకారం 23 వేల ఎకరాలు భూములు ఉన్నాయి. వీటిలో సుమారు 2 వేల ఎకరాలకు పైగా వక్ఫ్ భూములు కబ్జాకు గురయ్యాయని వక్ఫ్ బోర్డు ప్రాథమిక సర్వేలో అంచనా వేస్తున్నారు. అలాగే జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖకు సుమారు 45 వేల ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో దాదాపు 1,200 ఎకరాలకుపైగా భూములు అక్రమార్కుల చెరలో ఉన్నాయి. కాగా, అక్రమార్కుల పాలైనా వక్ఫ్, దేవదాయ శాఖలకు చెందిన భూములు ఎక్కువగా కర్నూలు నగర పరిధిలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా భూముల్లో పెద్దపెద్ద భవంతులు వెలిశాయి. మరికొన్ని భూములు పెత్తందార్ల చేతిలో ఉన్నాయి. వీటిని నిజంగా విడిపించి స్వాధీనం చేసుకుంటారా? లేక ఆక్రమణలను సక్రమం చేసేందుకు మరేమైనా చర్యలు తీసుకుంటారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నదీ పరివాహక భూములపై కూడా సర్వేకు ఆదేశం

కర్నూలు నగరంలో భాగమైన తుంగభద్ర, హంద్రీ నదులు రోజురోజుకు కుచించుకుపోతున్నాయి. నదుల బఫర్ జోన్ పరిధిని దాటి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఈక్రమంలో ఇటీవల కలెక్టర్ కర్నూలు ఆర్‌డీఓను హంద్రీ, తుంగభద్ర నదుల భూ విస్తీర్ణాలను తెలిపేందుకు సర్వేకు ఆదేశించారు. ఈ క్రమంలో ఇటీవల హైదరాబాద్‌లో హైడ్రా పేరు తో మూసీనది వెంట ఆక్రమణలను తొలగించిన విధంగా ఇక్కడా చేస్తారా? అనే చర్చ నడుస్తోంది.

26 మండలాలకు సర్వే బృందాలు



వక్ఫ్, దేవదాయ శాఖల భూములను సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లాలోని 26 మండలాల్లో తహసీల్దార్ల నేతృత్వంలో సర్వే బృందాలను ఏర్పాటు చేశాం. ఆ బృందాలు వక్ఫ్, దేవదాయ శాఖల భూములను సర్వే వివరాలను యాప్‌లో డిసెంబర్ 20 లోపు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆక్రమణలకు సంబంధించిన భూముల వివరాలపై వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ తగిన నిర్ణయం తీసుకుంటుంది.
– సత్యనారాయణమ్మ, డీఆర్వో, కర్నూలు

నాపరాయి పడి చిన్నారి మృతి



మృతిచెందిన యామిని

బేతంచెర్ల: డోన్ రహదారిలోని ఓ పాలిస్ ఫ్యాక్టరీ ఆవరణలో ఆడుకుంటూ ఉండగా తలకు నాపరాయి తగలడంతో ఓ చిన్నారి మృతి చెందిందిం. పోలీసులు తెలిపిన వివరాలు.. కొలుముల పల్లె గ్రామానికి చెందిన చిన్న మద్దయ్య, సువర్ణ దంపతులు బేతంచెర్లలోని ఓ పాలిస్ ఫ్యాక్టరీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం తమ ఐదేళ్ల కూతురు యామినిని వెంట తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమై ఉండగా పాప ఆడుకుంటూ ఉంది. ఈక్రమంల ఓ నాపరాయి తలపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. చిన్నారిని శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్‌ఐ రమేష్ ఆసుపత్రి వద్దకు చేరుకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ: బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. పుల్లారెడ్డి వీధికి చెందిన బాలిక పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. పరీక్షలు ఉండటంతో చదువుకోవాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి లోనైన బాలిక కుటుంబ సభ్యులు పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఉరి వేసుకుంది. స్థానికులు గమనించి బాలికను కిందకు దించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌ఐ నగీన తెలిపారు.





మూడురోజుల క్రితం పోలీసుస్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన పూల రైతులు,స్టేషన్ ఎదుట బైఠాయించిన మహిళలతో మాట్లాడుతున్న సీఐ, తూనికల కొలతల శాఖ అధికారులు

- పూల కాటా విషయంలో రైతులు – చిరు వ్యాపారుల మధ్య చిచ్చు రగిల్చిన దళారులు
- దళారులు మార్కెట్‌లో మోసం చేస్తున్నారని మూడు రోజుల క్రితం రైతులు ధర్నా
- రైతులే తమను మోసం చేస్తున్నారని స్టేషన్ మెట్లెక్కిన చిరు వ్యాపారులు
- మూడురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తూనికలు, కొలతలు, పోలీసు శాఖ అధికారుల హామీతో సద్దుమణిగిన వివాదం

కాటా కిరికిరి

డోన్/టౌన్: స్థానిక పూలమార్కెట్‌లో కాటా కిరికిరి ఉద్రిక్తతకు దారితీసింది. వారం రోజుల క్రితం రైతులు, వ్యాపారులు, దళారుల మధ్య తలెత్తిన వివాదంతో పూల వ్యాపారం స్తంభించిపోయింది. గిట్టుబాటు ధర లేదని దళారులు.. కాటాలో మోసగిస్తున్నారని పూల రైతులు మూడురోజుల క్రితం రోడ్డెక్కారు. కాగా బుధవారం దళారులతో కలిసి రైతులు పూలపై నీళ్లు గుమ్మరించి తూకంలో మోసగిస్తున్నారని చిరువ్యాపారులు(మహిళలు) స్టేషన్ ఎదుట ధర్నాకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, తూనికల కొలతల శాఖ అధికారులు జోక్యం చేసుకొని అటు మహిళలకు, ఇటు రైతులకు నచ్చజెప్పి సమస్య పరిష్కారానికి మూడురోజులు గడువు కోరడంతో గొడవ ప్రస్తుతానికి సద్దుమనిగింది.

చిరు వ్యాపారులను రెచ్చగొడుతున్నారు



డిజిటల్ కాటా వద్దని దళారులు కుట్ర పూరితంగా చిరు వ్యాపారులను రెచ్చగొడుతున్నారు. 50 కేజీల పూల గంపను మార్కెట్‌కు తీసుకువస్తే 18 కేజీలు ఉన్నట్లు తూకం చూపిస్తున్నారు. ఏళ్లకు ఏళ్లుగా మా కష్టాన్ని దోపిడీ చేసి దళారులు లక్షాధికారులైతే మేం మాత్రం అప్పుల పాలయ్యాం. ఎట్టిపరిస్థితుల్లోనూ డిజిటల్ కాటాలు పెట్టాలన్నదే మా డిమాండ్.
– శ్రీరాములు, పూల రైతు, ధర్మవరం.

పాతపద్ధతినే కొనసాగించాలి



మా రెక్కల కష్టాన్ని దోచుకునేందుకు రైతులు, దళారులు డిజిటల్ కాటా పేరుతో కుట్ర పన్నుతున్నారు. తూనికల కొలతల శాఖ ఆమోదముద్ర ఉన్న రాళ్ల కాటాతోనే పూలను తూకం వేసి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– శారద, కొండపేట, పూల వ్యాపారి

దోపిడీకి తెరలేపుతున్నారు



డోన్ నుంచి గుంటూరు, మహబూబ్‌నగర్, రాయచూర్ లాంటి సుదూర ప్రాంతాలకు గంపల్లో పూలను తీసుకువెళ్లి విక్రయిస్తూ జీవిస్తున్నాం. రేయింబవళ్లు నిద్రలు మాని రైళ్లలో ప్రయాణిస్తూ అష్టకష్టాలు పడుతున్న మమ్మల్ని మరింత దోపిడీ చేసేందుకు రైతులు, దళారులు ప్రయత్నిస్తుండటం శోచనీయం.
– జ్యోతి, పూల వ్యాపారి, చిగురుమానుపేట.

మూడు రోజుల్లో పరిష్కరిస్తాం

కాటా వివాదాన్ని పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంథియాజ్‌బాషా సహకారంతో మూడురోజుల్లో పరిష్కరిస్తాం. రైతులు, దళారులు, చిరు వ్యాపారుల మధ్య ఎలాంటి మనస్పర్థలకు తావులేకుండా పరిష్కారం చూపించగలమనే విశ్వాసం మాకుంది.
– ఖాజాహుసేన్, తూనికల కొలతల శాఖ అధికారి, డోన్.

కారు ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన తలారి రవి

డోన్ రూరల్: రోడ్డుపక్కన నిల్చొని ఫోన్ మాట్లాడుకుంటూ ఉన్న ఓ యువకుడిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. చిట్యాల గ్రామానికి చెందిన తలారి రవి(29) డోన్‌కు బైక్‌పై స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అబ్బిరెడ్డిపల్లి వద్దకు చేరుకోగానే ఫోన్ రావడంతో ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన నిలబెట్టి ఫోన్ మాట్లాడుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. క్షతగాత్రుడిని స్థానికులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో లారీ డ్రైవర్ దుర్మరణం



ప్రవీణ్ కుమార్(ఫైల్)

హైదరాబాద్‌లోని బాలనగర్ వద్ద హైవేలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ప్రవీణ్‌కుమార్(35) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ప్రవీణ్‌కుమార్ లారీకి డూటీ నిమిత్తం వెళ్లాడు. బాల్‌నగర్ వద్ద లారీని రోడ్డు పక్కన నిలబెట్టి రోడ్డు మీద ఫోన్ మాట్లాడుతూ నడుచుంటూ వెళ్తుండగా వెనుక నుంచి జీపు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యాగంటిలో..



మృతి చెందిన సురేంద్ర

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో బోయ సురేంద్ర(26) అనే వ్యక్తి బంధుమిత్రులతో దర్శనం నిమిత్తం వచ్చి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా గుంతకల్ మండలం కొచ్చెర్వు గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు సురేంద్రతో పాటు మరికొందరు బంధుమిత్రు లతో కలిసి యాగంటి క్షేత్రం వచ్చారు. సురేంద్ర తన స్నేహితులతో కలిసి సరదగా క్షేత్రంలోని కొనేరులో స్నానం చేశారు. కోనేరులో నుంచి బయటికి రాగానే సురేంద్ర అకస్మత్తుగా కిందపడి పోయ్యారు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉందని ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

భర్త ఇంటి ముందు భార్య ధర్నా



భర్త ఇంటి ముందు ధర్నా చేస్తున్న ప్రవీణ

ఎమ్మిగనూరు రూరల్: ప్రేమ పేరుతో వంచించి పెళ్లి చేసుకుని రెండు వారాలు కూడా గడవక ముందే వదిలేసి వెళ్లిన భర్త ఇంటి ముందు భార్య ధర్నాకు దిగిన ఘటన మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ప్రవీణకు రెండు నెలల క్రితం ఓ వ్యక్తితో వివాహం నిశ్చయం కాగా అదే కాలనీకి చెందిన వివాహితుడు అజయ్.. తాను ప్రేమిస్తున్నానని, బాగా చూసుకుంటానని మాయ మాటలు చెప్పడంతో కుదిరిన సంబంధాన్ని వదులుకుంది. తల్లిదండ్రులను కూడా కాదని అతడిని రెండో పెళ్లి చేసుకుంది. వారం రోజులు కలిసి కాపురం చేసిన తర్వాత అజయ్ తనకు పని ఉందని, రెండు రోజులు తన బాబాయి ఇంటి వద్ద ఉండాలని వదిలి వెళ్లాడు. రెండు నెలలైనా ఇంటికి రాకపోవటంతో అజయ్ బాబాయి తమ ఇంటి నుంచి వెళ్లిపోవాలని చెప్పడం.. తల్లిదండ్రులు ఇంటికి రానివ్వకపోవడంతో ఆమెకు దిక్కుతోచక భర్త ఇంటి వద్ద ధర్నాకు దిగింది. కాగా ప్రవీణ ఇంటికి వస్తుందని తెలిసి అజయ్ తల్లిదండ్రులు ముందే తాళం వేసి వెళ్లిపోయారు. పోలీసులు అక్కడకు చేరుకుని అజయ్‌ను రప్పిస్తామని సర్ది చెప్పడంతో ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది.

రేపు జిల్లా స్థాయి కళా ఉత్సవ్

కర్నూలు సిటీ: ఈనెల 6న బి.తాండ్రపాడులోని డైట్ కాలేజీలో జిల్లా స్థాయి కళ ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.జనార్దన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేంద్రీయ, నవోదయ, రెసిడెన్షియల్, ఇతర యాజమాన్యాలకు చెందిన స్కూళ్లలోని 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు పాల్గొనాలన్నారు. ఓకల్ మ్యూజిక్(గాత్ర సంగీతం) క్లాసికల్, ఫోక్, ట్రైబల్, డివోషనల్, ఓకల్ మ్యూజిక్ బృందం(5 మంది సభ్యులు)–బృందగానం, ఫోక్, ట్రైబల్, డివోషనల్, పేట్రియాటిక్, ఇన్‌స్టుమెంటల్ మ్యూజిక్(ఒక్కరు మాత్రమే)– క్లాసికల్, పెర్క్యూసివ్(తబల, మృదంగం, డ్రమ్స్), ఇన్‌స్టుమెంటల్ మ్యూజిక్ మెలోడిక్(వీణ, మయోలిన్, సీతార్), డ్యాన్స్(ఒక్కరు) క్లాసికల్(ఏదైనా భారతీయ శాస్త్రీయ నృత్యం), డ్యాన్స్(5 మంది బృందం)–ప్రాంతీయ(ఫోక్, ట్రైబల్), కాంటెంపరరీ కోరియోగ్రఫీ(సినిమాలకు సంబంధించినవి), ఏకపాత్రాభినయం, మిమిక్రీ, 5 మంది బృందంతో మైమ్ ప్లే, డ్రామా, విసువల్ ఆర్ట్స్ ఒక్కరు మాత్రమే 2డీ(ద్వితీయం) డ్రాయింగ్, పెయింటింగ్, ప్రింటింగ్, కార్టూన్, క్యారికేచర్, ఒక్కరు మాత్రమే ఉండే విసువల్ ఆర్ట్స్ 3డీ(త్రిమితీయ)స్కల్ప్చర్,మో డల్స్, స్వదేశీ బొమ్మలు తయారీ, ఆటలు, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ ఒక్కరు/ఇద్దరు డ్యాన్స్, డ్రామా, మ్యూజిక్, విసువల్ ఆర్ట్స్, ఒక్కటి కంటే ఎక్కువ కళ రూపాలు వంటి అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల చేత ఆయా యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు, కాలేజీలకు చెందిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఒక విద్యార్థి ఒక అంశంలో మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు డైట్ లెక్చరర్ సి.ప్రభాకర్‌బాబు(89851267578) నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీల నిబంధనలు

- గత సంవత్సరం కళా ఉత్సవ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారు ఈ ఏడాది నిర్వహిస్తున్న పోటీలకు అర్హులు కాదు.
- పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే శిక్షణ పొంది ఉండాలి.
- కళా ఉత్సవ్‌లో పాల్గొనే విద్యార్థులు మేకప్, ఇతర సామగ్రిని వారే ఏర్పాటు చేసుకోవాలి.
- పోటీలలో వ్యక్తిగతంగా, జట్లలో పాల్గొనేవారు తమ పాఠశాల, కాలేజీ యాజమాన్యం వారు ఇచ్చిన లేఖలను/గుర్తింపు కార్డులను నిర్వాహకులకు అందజేయాలి.

వ్యవసాయ వార్షిక అవార్డుకు పెంచికలపాడు రైతు



వీరంరెడ్డి మహేశ్వరరెడ్డి

కోడుమూరు రూరల్: గూడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన రైతు వీరంరెడ్డి మహేశ్వరరెడ్డిని రాష్ట్ర స్థాయి వ్యవసాయ వార్షిక అవార్డు–2023కు ఎంపిక చేసినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీవర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. రైతు మహేశ్వరరెడ్డి ఐదేళ్లుగా ఎలాంటి రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పత్తి, శనగ, వేరుశనగ, కంది పంటలను పండిస్తున్నారని ఏఓ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు మహేశ్వరరెడ్డి కృషిని అభినందిస్తూ ఉన్నతాధికారులు రాష్ట్ర స్థాయి వ్యవసాయ వార్షిక అవార్డుకు ఎంపిక చేశారన్నారు.

నేడు, రేపు న్యాయవాదులు విధుల బహిష్కరణ

కర్నూలు (లీగల్): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీఓ 145కు వ్యతిరేకంగా న్యాయవాదులు గురు, శుక్రవారాల్లో విధులు బహిష్కరించనున్నట్లు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, రవికాంత్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం గంజాయి కేసులు విచారిస్తున్న ఆయా జిల్లాల మొదటి అదనపు జిల్లా కోర్టులను కాదని విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి కేంద్రాల్లోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లోనే గంజాయి కేసులు విచారించాలని ఉత్తర్వులు జారీ చేయడం సబబు కాదన్నారు. ఏ జిల్లాలో ఉన్న కేసులు ఆ జిల్లాలోనే విచారణ జరగాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు క్రీడాకారుల ఎంపిక



ఫర్హాన

కర్నూలు(రూరల్): రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థా యి పోటీలకు ఎంపికయ్యారు. వారిని బుధవారం తమ తమ పాఠశాలల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించి ఆర్థిక సాయం అందించారు. కర్నూలు మండలం గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఫర్హాన గత నెల 6 నుంచి 9వ తేదీ వరకు అనకపల్లి జిల్లా నక్కపల్లిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ (అండర్–14) పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని మదార్సా నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. స్థానిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినిని హెచ్ఎం వెంకట్రాముడు, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు రెడ్డిపోగు ప్రశాంత్ అభినందించారు. రూ.1,500 ఆర్థిక సాయం అందజేశారు.

కబడ్డీలో ఆలూరు విద్యార్థి..



విద్యార్థి వేణు

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వేణు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. గత నెల 6 నుంచి 8వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో నిర్వహించిన అండర్–19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటి ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం విద్యార్థి వేణుకు ప్రిన్సిపాల్ రమాదేవి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివశంకర్, అధ్యాపకులు పాండు, కృపాకర్, సమన్ రాజు, సంజప్ప, గోవిందు హుసేన్ మియా పాల్గొన్నారు.

తవ్వకాలను అడ్డుకుంటాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్యాపిలి: యురేనియం తవ్వకాలను అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని జక్కసానికుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు రామచంద్రయ్యతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జక్కసానికుంట్ల, రాంపురం, మామిళ్ల పల్లి గ్రామాల్లో యురేనియం తవ్వకాల కోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించడాన్ని ఖండిస్తున్నామన్నారు. పంటపొలాలు, పాడి పశువులతో కళకళలాడుతున్న గ్రామాలు యురేనియం తవ్వకాల గురించి ఆందోళన చెందుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి ఈ విషయంపై నోరు మెదపకపోవడం తగదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే యురేనియం టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలన్నారు. లేకపోతే సీపీఐ తరఫున ప్రజలపక్షాన నిలబడి తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెనిన్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, రాష్ట్ర సమితి సభ్యులు నబిరసూల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు మోటా రాముడు, వెంకటేశ్ పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో దేశ వ్యాప్త నిరసనలు

ఆలూరు రూరల్: అదానీ అవినీతిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 9, 10 తేదీల్లో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. బుధవారం మొలగవల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అదానీ గ్రూప్‌తో సోలార్ పవర్ ప్రాజెక్టులతోపాటు చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలన్నారు.